మచ్చలు

పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు భవానిరావు 'డ్యూటీ'మీద వెడతోవుంటే, నేనూ వెళ్ళాను. బ్రాహ్మణ వీధులలో చిన్న పురాతనపు పెంకుటిల్లది. దాని ముందు పెద్ద గుంపు పోగయింది. పోలీసుజవాను అడ్డంనుంచుని ఎవర్నీ లోపలికి పోనివ్వటంలేదు. మేమిద్దరమూ నడవాలోంచి లోపలికి వెళ్ళాము. కిటికీకింద మూలనున్న పెద్ద నవారుమంచంమీద ఆపిల్ల శవం పడివుంది. మాసిపోయిన వంగాపచీరా, నల్లనిరవికా రక్తంతో తడిసివున్నాయి. మెడకింద నాడు పళ్ళతో చీల్చిన గాయం కనపడుతోంది. ఎదిగిన వాళ్ళెవరిలో అంత చిన్నపిల్లను నేనెన్నడూ చూడలేదు. ఆ అమాయకమూ, విశ్వాసమూ, ఆశ్చర్యమూ, కళ్ళు మూతలుపడివున్న, ఆచిన్న పెదవి వొంపులో, ఆ గడ్డం కొనలో, ఆ కనుబొమ్మలు కలుసుకోడంలో నాకు కనపడ్డాయి. నిద్రలో భయమేసి యేడుస్తున్నట్టే ముద్దుగా జాలిగావుంది. భవానీరావు నోట్సు తీసుకుంటున్నాడు. నన్ను బాధించే జాలిని భరించలేక బైటికి వెళ్ళాను.

అరుగుమీద కూచున్న ఒక కుర్రాడి మాత్రం నన్ను తనివేపు కనిపెట్టి చూసేట్టు చేసింది. అతని మొహంలో విచారమూ, నిరాశా, ద్వేషమూ చెప్పలేనంత గాఢంగా కనబడుతున్నాయి.

"ఎవరు నువ్వు?"

నామాట నిర్లక్ష్యంచేసి

"వాణ్ణేం చేస్తారండీ?" అన్నాడు.

నడవాలో కూచున్న కైదీవంక చూశాను. అక్కడ జరిగే వ్యవహార మంతా తనకేమీ సంబంధం లేనట్టూ, తనేదో తన తపస్సులోనో యోగం లోనో వున్నట్టు కూచుని వున్నాడు.

"మీరు పోలీసులేగావును. అందుకని అడిగాను. అయినా వాణ్ణేం చేస్తేమాత్రం మాకేం పట్టింది. మీపని మీరు చేసుకు వెడతారు".

అని వూరుకున్నాడు. అతని మాటల్లో బాధా అణుచుకుంటున్నట్టు వంటిమహావిషాదమూ, చూసి ఆశ్చర్యపోతో నుంచున్నాను. మళ్ళీ అతను—

"వాణ్ణేదో చేస్తారు తప్పదు. ఉరి తీస్తారేమో! కాని వాణ్ణిప్పుడేం చేసి ఏంలాభం? పోయిన ప్రాణం, మధురమైనదీ, అమాయకమైనదీ. ఆ ప్రాణం తిరిగిరాదుకదా, ఆమె మళ్ళీ మెల్లిగా, దీనంగా, నడుస్తో, బెదిరిబెదిరి చూస్తో, ఇంక కనపడదుకదా? ఎవరన్నా ఒకరు దయగలవారు తనకోసం అనుకంపపడేవాళ్ళు ఈ లోకంలో వున్నారా అని వెతికివెతికి, కనపడక, నిరాశపడి, పరలోకాన్ని వెదకబోయింది. ఇప్పుడు అంతా మిగిలిపోయిం తరవాత, అందరూ కనికరం చూపేవారే!

"అన్యాయం జరిగిందనేవాళ్ళే! కాని ఆరేళ్ళనించి వాళ్ళ కళ్ళముందే యీ హత్య జరుగుతోవుంటే, వొక్కడూ—వొక్క ఆడది—ఒక్క దయ గలమాట మాట్లాడినవాళ్ళు లేరు. శవంమీదవున్న కరుణ వీళ్ళకి మనుషుల మీద వుండదు. మీరందరు ఇప్పుడు—హత్య జరిగింతరవాత వొస్తారు, ఘనుల మని—ఏం చేస్తోందో యీ పోలీసు సిబ్బంది అంతా ఇన్ని రోజులూ! బతికి వున్నప్పుడు కాపాడేందుకు ఒక్కరూ కనపడరు. శవంచుట్టూ రాబందుల్లాగు వాలారయ్యా! ఇదంతా వాణ్ణి వురితీసేందుకు, ఈ అట్టహాసం! ఏం లాభం? ఏంన్యాయం? ఆ పిచ్చివాణ్ణి చంపి? వాడి కేం తెలుసు?" అన్నాడు.

"వాడికి పిచ్చా?"

"పిచ్చా! ఏమో! నాకు తెలీదు. మీడాక్టర్నడగండి" నేనింకా అడగబోతుండగా, చివాలునలేచి గుంపువెనక్కిపోయి మాయమైనాడు.

ఆవాళ సాయంత్రం కాలువొడ్డున చాలాదూరం షికారువెళ్ళి ఇంటికి తిరిగివస్తున్నాను. ఆకలివేస్తోంది. వంటవి సిద్ధంగానే వుంటుంది. గాని, ఇల్లుచేరగానే మెతుకులురావు. కాళ్ళు కడుక్కొని, మడిపంచకట్టి, సంధ్య వార్చినట్టు నటిస్తేనేకాని, మా అత్త అన్నంగిన్నె చాయకుపోదు. నా అదృష్టం కొద్దీ, ఏ మేనమామ సవతితల్లి మరదితమ్ముడో నామీద ప్రేమచాత వొచ్చి మడిగట్టి ముక్కుమూశాడంటే, పదిగంటలకన్నా తిండి దొరికినట్టే. అదేమి ప్రారబ్ధమో మాయింటికి వొచ్చిన అతిథులందరికి, మొదట ఆచారమూ, భక్తి, అధికమౌతాయి. రెండోది ఆకలి మందగిస్తుంది. కాని భోజన తత్పూర్వమే ఆమందం, భోజన ప్రారంభములోనే ఆమందం మాయమై, చప్పున మొదట

అజ్ఞాధారతోనే జఠరాగ్ని భగ్గుమని, సమస్త పదార్థాలనీ ఆహుతిచేస్తుంది, నాకు మారు వడ్డనకి నాన్న మిగలనివ్వడా.

తిరిగి చంద్రవంక రక్తంతో తడిసిన వాకిటికి తలగు పడమటు పాకుతోంది. గాలి నిర్భయంగా ఎన్నెన్నిటిలోంచో దూసుకుపోతోంది. కాలవ రెండో వొడ్డున శ్మశానంలో శవం కాలిపోతోంది. ఎగసి కాలే ఆగాలిలో నాలికల వలె యెర్రని జ్వాలలు గాలిమీరినించిలేచి పక్కనున్న నలుగురు మనుషులని కూడా అందుకోవాలని చూస్తున్నాయి. ఆపిల్ల శవమే అయివుంటుంది. పొద్దున్న నేను చూసిన ముడతలులేని ఆచిన్ననుదురూ ఎడస్తున్న ఆపసిబిడ్డ నోరూ యింక లోకంలో యెవరికి ఎన్నటికీ కనపడవు. అంత అందంగా హృదయాన్ని కరిగించేటట్లు సృష్టించిమాపుని, మెత్తదనాన్ని అందాన్ని కల్పించి యిట్లా నిర్లక్ష్యంగా నాశనం చెయ్యడంలో యీ సృష్టి వుద్దేశ్య మేమిటో? లోకాన్ని మిరుమిట్లు గొలిపిన సౌందర్యవతులు అహల్య ట్రాయిహెలన్, క్లియోపాత్రా ద్రౌపతి, నూర్జహాన్, వీళ్ళందరి సౌందర్యమూ, ఇట్లాగే కాలిపోయింది, చీకిపోయింది, మన్నూ బూడిదా అయింది. ఎందుకో ఇట్లా! ఈశ్వరుడే సుందరుడూ, ఆనందమయుడూ ఐతే, లోకమంతా యిన్ని వికార రూపాలెందుకో, రూపాలే కాదు—మనసులు. ఆత్మలూ—అన్నీ ఇవే—ఎక్కడో ఒక్క సుందరమైన ముఖమూ—దృష్టి, హృదయమూ వుంటే, అవి ఇట్లా నలిగి, చిరిగి, నాశనమౌతాయి. నాగుండెల్లో చెప్పలేనిదిగులు ప్రారంభించింది.

కాలవ పక్కన కూచున్నాడు ఎవడో! ఏడుస్తున్నాడు. ఆగాను, ఆ సన్నని వెన్నెల ఒకవేపూ ఆచితిమీది యెర్రని వెలుగు రెండోవేపు ముఖం మీద పడతోంది. కెర్రిచూపు. వొళ్ళంతా తడిసింది. వెక్కి వెక్కి యేడుస్తున్నాడు, పొద్దున్నటి కుర్రాడు. నాశనంకూడా ఆవిధంగా తెలపడేరోజు నాకిళ్ళయదటు భావించుకుంటున్న నాకు ఆ సమయంలో నాదురభిమానమూ, అధికార గర్వమూ, విద్యాధిక్యతా అన్నీపోయి, సమస్త జీవరాసులతోటి సమానత్వం తటస్థించినట్టు తోచింది. ఆ అబ్బాయి దగ్గరికి వెళ్ళి, బుజంమీద చెయ్యేసి—

"తమ్ముడూ! ఆబాధయేమిటో నాతోటి చెప్పరాదూ?" అని దయగా అడిగాను. వెంటనే హృదయవిహారాలు విడిపోయినట్టు—

"కాలిపోతోంది. పోతూంది కాలిపోతూంది." అని బిగ్గరగా ఏడ్చాడు. అతని చెయ్యి పట్టుకుని దూరంగా నడిపించుకుని తీసి కెళ్ళాను. వంగ్రుడ స్తమించాడు. నక్కలుకూస్తున్నాయి, కాలువనీళ్ళు తూముక్రిందనుంచి 'లబ, లబ' శబ్దం చేస్తోపోతున్నాయి. చీకట్లో భయంలేక కీచురాళ్ళు శబ్దంచేస్తున్నాయి.

"సంగతేమిటి? ఆపిల్లనీకు బంధువా? ఇట్లా రహస్యంగా రెండు కేడుస్తావు?"

అప్పటికి పోల్లివచ్చే విచారాధిక్యత తగ్గింది. కన్నీళ్ళు తుడుచుకుంటూ యీకథచెప్పాడు. నా ఆశల్నీ, భార్యనీ, మంతినాయుగునీ, కంగిసప్పుడినీ, బంధువుల్నీ వదిలి విన్నాను- ఏరాత్రిదాకానో

"వాళ్ళది బీదకుటుంబం. ఆ పిల్ల ప్రతిదినమూ మా యింటికి మజ్జిగకి వొచ్చేది. నాభార్య ఆమెతో సాధారణంగా పరిహాసాలాడుతూ దయగా సంభాషణచేస్తూవుండేది. నేనూ అక్కడ వుండడం తటస్థించినప్పుడు తమాషాకి మాటలు కలిపి నవ్వేవాణ్ణి. ఆమె చక్కని చిన్నినవ్వునవ్వేది. ఆనవ్వు మాటాలనే నగదాలో, ఏదో వొకటిచెప్పి నవ్విస్తాను. ఒకరోజు ఆమె బుగ్గ మీద పెద్దమచ్చతో మాయింటికి వొచ్చింది. నాభార్య అదేమిటని అడిగితే, సిగ్గుతో మాట తడబడపడి, మంచంకోడు తగిలిందని చెప్పి తప్పించుకోవాలని చూసింది. నాభార్య వొదలక ఏమిటో చెప్పమని ఆ మచ్చనిపట్టుకు పరియాచకాలాడుతోంది. నేను వెళ్ళాను.

"దుర్గమ్మా—"

ఆ పిల్లపేరు దుర్గమ్మ.

"దుర్గమ్మా, వారంరోజులకిందట దీనిభుజంమీద ఎర్రనిమచ్చ వొకటి పడ్డది. నీళ్ళుపోస్తే తీళ్ళఅమ్మ అదేమిటే అని అడిగింది కూడాను. అదెట్లా వొచ్చిందో అడుగు" అన్నాను.

నాభార్య "మరీ అట్లానా?" అని పెద్దనవ్వు నవ్వింది. దుర్గమ్మ బుగ్గ మూసి, దుర్గమ్మ వుడుకుకుని, కళ్ళనీళ్ళు కుక్కుకుంటూ, మజ్జిగ తీసుకోకుండానే వెళ్ళిపోయింది.

తరవాత—ఆరోజు అట్లుద్ది రోజున—నాభార్య ఆ పిల్లని వుయ్యాల మీద కూచోపెట్టి వూపిస్తూ నడుందగ్గిర పట్టుకొనేటప్పటికి పెప్పిఅని అరిచింది

ఆపిల్ల. రెండుమూడుసార్లు అట్లానే జరిగేటప్పటికి అందరు పిల్లలూచేరి ఏమిటో చూపమన్నారు. ఏవో కురుపులనీ, దెబ్బలనీ, చెపితే నమ్మక చీర బలవంతంగా తొలిగించి చూశారు. ఎర్రని పెద్దమచ్చ కనపడ్డదని నాభార్య చెప్పి ఒకటేనవ్వింది.

కొన్నాళ్ళ తరవాత నాలుగురోజులు మజ్జిగకిరాలేదు. ఏమా అనుకున్నాము. భావిదగ్గిర నాభార్యకి తలకి కట్టు కట్టుకుని దుర్గమ్మ కనపడి, పిలిచినా రాకండా వెళ్ళిపోయింది. రెండు రోజులతరవాత ఆకట్టుతో వొచ్చింది మామూలుగా!

"రావటంలేదేం? దుర్గమ్మా!" అన్నాను.

నవ్వి "ఇట్లు కట్టుకున్నానుగా!" అంది.

తమాషాకి కట్టు కుందనుకున్నాను.

"మరి విప్పండే వొచ్చావేం?"

"విప్పిందాకావుంటే, మజ్జిగలేక యీల్లోపున కాకచేసి చస్తామని భయమేసింది, అదిగాక అన్నంలోకి యింకేం గతిలేదు."

"ఆకట్టుతియ్యి"

"అమ్మా! ఆశే!"

"ఏముంది?"

"రత్నాలనీ వొలికిపోవూ?"

"నేను ఏరుకుంటాను."

అని చప్పున కట్టు లాగేశాను. బిత్తరపోయింది ఆమనిషి. రెండు బుగ్గలమీదా, రెండువరసలుపళ్ళు దిగపడ్డ గంట్లున్నాయి. కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంటూ కొంగు ముఖంమీద కప్పుకొని దుర్గమ్మ పారిపోయింది. ఆ గాయంచూస్తే నాకు భయం, జాలి, ఆశ్చర్యం, ఇన్నికలిగాయి. పొద్దున్న చూడలా, వాడే రత్తయ్య, ఆమె మొగుడు. వాణ్ణి నేను మొదటినించీ యెరుగుదును. చిన్నప్పుడు వాణ్ణి పిచ్చిరత్తయ్య అనేవాళ్ళం. ముంగి. చిన్నప్పుడు కూడా ఆటలాడడు, నవ్వడు, గంతులెయ్యడు. గుడ్లగూబలాగు చూస్తో కూచుంటాడు. వాణ్ణిచూస్తే అందరికీ అసహ్యాం, ఏదో మురికిగాకనపడేవాడు. పెద్దయినాక మేమెవరం వాడితో మాట్లాడ్డం మానేశాము. వాడూ ఒకరితో

మాట్లాడడు, ఒకరి జోలికిరాడు. పనిచెయ్యడు. అట్లా కూచుంటాడు చుట్ట కాలుస్తో.

వాడిప్రకారం, ఆ పిట్టలాగుండే దుర్గమ్మను, ఎందుకు బాధించాలా అని ఆలోచించాను. వాడేనా ? వాడుకాక ఇంకెవడు ? దుర్గమ్మవంటి భార్యవుండడం అధికమైన అదృష్టం, అతనికి క్రోధం తెప్పిస్తుందని అను కోడం కూడా పాపకరమైన విషయం. దుర్గమ్మనే అడుగుదా మను కున్నాను. కాని అంతవరకు నాభార్య వెనకనుంచుని పరిహాసాలేగాని, ఎన్నడూ నేనాపిల్లతో సరిగా మాట్లాడలేదు. అందుకని నాభార్యనే అడగమన్నాను.

ఒకరోజు దుర్గమ్మ తండ్రి వాళ్ళవూరునించి దుర్గమ్మని చూడ్డానికి వొచ్చి మానాన్నగారి దగ్గరికి వొచ్చాడని తెలిసింది. మానాన్నగారూ మునసబూ, ఆ వూరికి పెద్దా. ఆయన మానాన్నగారితో, తన కూతురికి పుట్టింటికి రావాలని వున్నదనీ, రత్తయ్య పంపడంలేదనీ చెప్పుకుని ఏడ్చాట్ట. తరవాత వారంరోజుల్లో రత్తయ్య పెళ్ళాన్ని కొడుతున్నాడని పుకారు పడ్డది. నాకెందుకో ఆ పిల్లసంగతి మొదటినుంచీ నాస్వంత వ్యవహారంగా కనపడేది. పుకారు ప్రబలమయింది. నాకు దుర్గమ్మ కనపట్టం లేదు. నాకు జాలివేసి ఆపుకారు ఎట్లా వొచ్చిందని విచారిస్తే, రత్తయ్య యింటిపక్కన వున్న నాగన్న పుట్టించాడని తెలిసి వాణ్ణి దబాయించాను. వాడు రుజువు చేస్తానన్నాడు. మర్నాడు తెల్లారకట్ట వొచ్చి, నన్ను లేపి రత్తయ్య ఇంటి పక్కన నుంచో పెట్టాడు. లోపల్నించి జాలిగా మూలుగు వినపడుతోంది. క్రమంగా పెద్దదై ఏడుపుగా మారింది. కాని కోపంతో కేకలు లేవు. మళ్ళీ విన్నాను. నేనో విధంగా అర్థంచేసుకున్నాను. పట్టరాని నవ్వు వొచ్చింది నాగయ్య ఏమిటంటాడు.

"ఏమిటా ? అది కొట్టడంరా ? నీ మొహం ? నీకూ పెళ్ళిగానీ ఆ మూలుగు అర్థమాతుంది. ఇట్లాంటి వెధవపుకార్లు పుట్టించకు. తన్నేను." అని వాణ్ణోతోపుతోసి యింటికి వొచ్చి నిద్రపోయినాను. కాని దుర్గమ్మ వొంటిమీద చూసిన గాయాలూ, ఆపిల్ల కళ్ళల్లోచూసిన బాధా నా మన సుని కలవరపెట్టి, ప్రశ్న లడుగుతూనే వున్నాయి.

వారం రోజుల్లో దుర్గమ్మ మా ఇంటికి వొచ్చింది. అన్నాళ్లు ఎందుకు రాలేదంటే జవాబు చెప్పలేదు. అప్పుడు నేనూ నాభార్యా కలిసి అడిగాము. "నిన్ను రత్తయ్య, కొడతాడా?" అని. కొడుతోవుంటే, వాడు మానేటట్టు చేస్తానన్నాను. ఆమాటలకి చెప్పరాని భయమూ, సిగ్గూ, కలిగి దుర్గమ్మ 'లేదు లేదని, ఏదో వికారంగా' అని వూరుకుంది. ఎంత అడిగినా చెప్పలేదు. అటు తరవాత దుర్గమ్మని చూసినప్పుడల్లా నవ్వొచ్చేది, వాళ్ళ దెబ్బ సరసాలూ అంత తీవ్రంగావుంటాయిగావును అనుకున్నాము. "ఏం దుర్గమ్మా! ఎక్కడున్నా కొత్తమచ్చలు!" అని మొదట్లో నాభార్య తరవాత నేనూ అనడం మామూలయింది.

నాభార్య ప్రసవానికని పుట్టింటికి వెళ్ళింది.

ఒక సాయంత్రం మాదొడ్లో దుర్గమ్మ గోంగూరకోసుకుంటూ వుండగా నేనక్కడికి వెళ్ళడం తటస్థించింది. దడిదగ్గరగా తెల్లనీ పచ్చనీ, చంద్రకాంతపూలు వికసించాయి. ఎండలో వాడిలిన గోగుపూలు సాయంత్రపు గాలిలో ప్రాణాల్ని నింపుకుంటున్నాయి. కొట్టంముందుకట్టిన ఆవులు నన్ను చూసి మెడలుచాస్తున్నాయి. ఉండుండి అంబా అని పిలుపు వినపడుతోంది. రాత్రి కాంతి అప్పుడే భూమి నావరించింది. దుర్గమ్మ వొక్కత్తా గోగుచెట్ల నడుమ, దిగులుగా నుంచుని, ఒక్కొక్క ఆకే వొళ్ళో వేసుకుంటోంది. నా హృదయంలో అపరిమితమైన దిగులు ఆవరించింది. ఆమెదగ్గిరికి వెళ్ళి

"ఏం కొత్తమచ్చలు లేవూ?" అన్నాను.

సిగ్గుపడక, చిన్న నవ్వుతో "లేవండీ" అంది.

నా మనసులో కొత్తవికారం వుదయించింది. భార్య ఇంట్లో లేకపోవడమే కారణమనుకుంటూ ఇంకా దగ్గిరిగా అడుగువేసి, కొంటెగా, "కొత్తమచ్చలు లేనేలేవా?" అన్నాను మళ్ళీ.

"ఉంటే, కనపడవూ" అంది ధైర్యంగా.

"కనపడనిచోట్ల వున్నాయా?"

కళ్ళూ తలా తిప్పేసింది. ఆ నిముషాన ఆ పిల్లమీద నిష్కారణమైన జాలీ, వున్నతమైన ప్రేమా కల్గాయి. ఆ చూపులో యితరుల సహాయం అడిగే జాలివుంది. నేను చెయ్యగల సహాయం ఒక్కటే కనపడ్డది నాకు.

ఆ సమయాన ప్రేమకీ, కామానికీ, జాలికీ ఎంత సన్నిహితమో! మోకాళ్ల వరకు ఎగదీసికట్టిన ఆమె చీరా, రొమ్మును దాచడానికి శ్రమపడే ఆ రవికా, గాలిలో వూగుతున్న ఆమె జుట్టూ, నన్ను వెళ్లిపోనీక ఆటంక పెట్టాయి. ఈ గోంగూర ఒక్కొక్క ఆకే కోసి, ఏరి, వొండి, ఆ చీకటి బూజుయింట్లో, ఆమూల, ఆ ముంగి వెధవకి తినిపిస్తుంది. ఒక్క ఆకన్నా మిగల్చక తిని, యీమె వంక తలెత్తి చూడక లేచిపోతాడు వాడు. నా హృదయంలోని ఆ కరుణాభావాన్ని భరించలేక పోయినాను. ఎట్లా సంతోషమివ్వగలను, ఆ బేలహృదయానికి? మచ్చలేవి? చూడనీ" అని ఆమె బుజంమీది రవికను పక్కగా లాగాను. దుర్గమ్మ మెల్లగా నావేళ్ళను తొలగించి మళ్ళీ కప్పుకున్నది. అదే పట్టుదలతో రెండో చేతి పక్కన చూశాను.

అక్కడో పెద్ద మచ్చవుంది. ఇంకా కొంచెం కిందగా రొత్తుగా మొదలు పెట్టేచోట యింకో మచ్చవుంది. "పాపం, దుర్గమ్మా!" అని ఆమె తలని నా రొమ్ముకి అద్దుకున్నాను.

"ఎందుకు నా మచ్చలజోలి నీకు? ఎప్పుడూ నవ్వుతావు? వొళ్లంతా అవే." అని మోకాలి మీద చీరెత్తి చూపింది. నేను వప్పున యింకా పైకి లాగి "ఇంకాలేవా?" అన్నాను. తలయెత్తి నావంక తెల్లబోయిచూస్తో నుంచుంది. ఎర్రని పడమటికాంతి ఆమె కళ్ళమీద మెరిసింది. నేను ఆమె బుజాన్ని పట్టుకుని వొంచబోయినాను. అప్పుడు కలిగింది జ్ఞానం ఆ అమాయకపు కళ్ళల్లో. భయంతో - వొణుకుతో - ఆ చిన్న మొహం - జాలిపోతున్న ఆ చిన్న మొహం—చెప్పనులేను ఆ బాధ మెడకాయి తెగుతున్న కోడి కళ్ళలోకి వచ్చే చూపు—

"నీకు చెల్లెల్ని, అన్నయ్యా, కొరక్కు—ఆ పని తగదు నీకు. నన్ను కొరక్కు. నీకు ఆ బుద్ధికూడదు నీ కాళ్ళు పట్టుకుంటా, కొరక్కు—" అని సన్నగా కీచుమని అరిచింది.

నామోహం పటాపంచలయింది. భరించలేని సిగ్గుతో, జాలితో, ఆశ్చర్యంతో వెళ్లిపోయినాను. నామీద, నా కామంమీద, పరమ అసహ్యం కలిగింది. ఆనాటినించి యింతవరకు పరాయి ఆడదాన్ని తాకలేదు. ఆచూపు నన్ను దయ్యంవలె వెంట తరుముతోంది. ఆ కళ్లు, దీనమైన ఆ కళ్ళు—ఎవరి

తోను చెప్పుకోలేని బాధతో కుంగిపోయిన ఆపాపలు, రక్తధారలు కార్చిన ఆ పాపలు—బొగ్గయిపోతున్నాయి. తనే కాకుండా, లోకాన్నంతా నాకు చెల్లెళ్ళని చేసింది దుర్గమ్మ. తల్లి కాలి పోతోంది.

ఆలోచించాను, కొరకవొద్దని అరిచిందేమిటి? ప్రేమఅన్నా, లాలన అన్నా, దుర్గమ్మకి కొరకడంతో ప్రారంభమని అభిప్రాయం. వాడూ ఆర త్తయ్య కారణం. వాణ్ణి వెళ్ళి "ఇదేం, రోగంరా!" అని తందామను కున్నాను. కాని నా కెట్లా తెలిసిందని వాడనుమాన పడడా? వాడి భార్యమీద అట్లాంటి కోర్కెపడి, పైగా వాణ్ణి యామని తన్నను? ఏం చెయ్యను? దుర్గమ్మని వొచ్చేసి మాయింటో వుండమంటే, పారిపొమ్మంటే, లేక నేను ఎక్కడన్నా ఆమెని కాపరంపెడితే — ఇట్లాంటి చాతకాని ఆలోచనల్ని చూసి నేనే నవ్వుకున్నాను.

దుర్గమ్మ మాయింటికి ఇంకరాలేదు. ఒక్కసారి ఆమెతో మాట్లాడాలని వుంది. నాభార్య నెలరోజులయిం తరువాత వొచ్చింది పుట్టింటినించి. రాగానే ఆమె చాత కబురంపి పిలిపించాను దుర్గమ్మని.

"దుర్గమ్మా, రత్తయ్య రాక్షసి. నువ్వా బాధలు పడలేవు. ఎక్కడికన్నా వెళ్ళు. నేను సహాయం చేసాను."

"నేనా? ఎక్కడికన్నా వెళ్ళనా? సంసారం వొదలుకుని! మంచి మాటలు మాట్లాడుతున్నారు. నేనెందుకు వెళ్ళాలి?" అని ఒక్క విసురున వెళ్ళిపోయింది.

నాకు దుర్గమ్మమీద కోపం వచ్చింది. సహాయం చెయ్యబోతే యిదీ! కాని నేను ప్రయత్నించిన దుర్మార్గమూ, ఆమె విశ్వాసాన్ని పోగొట్టుకున్న సమాచారమూ చక్కగా మరచి పోయినాను.

రత్తయ్యమీద వూరంతా పుకార్లుగావున్నాయి.అతనికి పిచ్చెత్తిందంటున్నారుకొందరు. ఇద్దరు ముగ్గురు యీడ్గఆడవాళ్ళనివెంబడించి బలవంతంచేసి పట్టుకుని కరవబోతే, దొంగ అనుకుని తన్నారుట. దుర్గమ్మ రెండుసార్లు ఇంటోంచి పారిపోతే వూరివాళ్ళు లాక్కొచ్చి దిగడ్డారు. ఈసంగతులన్నీ వింటున్నా నేను జోక్యం కలగచేసుకోలేదు. నాకేం? ఆడదితృణీకరించిం తరువాత మళ్ళీ ఆమెనే మం కనుక్కుంటానా? అని అభిమానపడ్డాను.

ఒకరోజు రాత్రి నాపడకగదితలుపు కొట్టారు యెవరో. తెరిస్తే లోపలికి వొచ్చింది దుర్గమ్మ. నాభార్య పందిరిపట్టె మంచంమీద, చామంతి పూలతో, పట్టు దిండుమీద తల పెట్టుకుని నిద్రపోతోంది. నేను కుర్చీలో పడుకుని, పతివ్రతల కథలు చదువుకుంటున్నాను. కొత్తగాపుట్టిన మా పాప వాడి అమ్మమ్మ యిచ్చిన వుయ్యాలతొట్టిలో పడుకుని, దీపంకేసి చేతులు జాచి వూగులాడుతున్నాడు. సాంబ్రాణి వొత్తులు కొసవరకూ వెలుగుతున్నాయి. మాగదినీ, మా సౌభాగ్యాన్నీ గావున చూస్తో నుంచుంది దుర్గమ్మ.

"ఈరాత్రికి, మీ యింట్లో....ఆ వసారాలో....యెక్కడైనా సరే పడుకోనియ్యండి" అంది కష్టంగా.

కారణం తెలుసుకోవాలనే ప్రబలమైన నాకోర్కెని దిగమింగుకుని,

"దానికేం? పడుకో. మీ ఇంట్లో వీలులేదా?" అన్నాను. గుడ్ల నీళ్లు కుక్కుకుని మాట్లాడలేదు. వరండాలో మంచం జంపకానా వేసి పడుకోమన్నాను. నా వెంటవొచ్చి మంచంమీద కూచుని, వెళ్ళబోయ్యే నా చెయ్యి పట్టుకుని, కళ్లనద్దుకుని వెక్కి వెక్కి యేడ్చింది. కాని ఏమీ మాటాడదు, ఎంత అడిగినా— "నిర్భాగ్యురాలిని. నా సంగతెందుకు—వెళ్ళి పడుకోండి" అంటుంది ఏం చెయ్యను?

జీవితంలోని దురదృష్టవంతులు, మన పక్కనేవుంటారు, మనలోనే, స్నేహంగా తిరుగుతోవుంటారు. బాధపడుతో గాయాలు పడుతో, మన కళ్ల యెదటనే అకాలమృత్యువువేపు నడుస్తోవుంటారు. మనం గుర్తించం. గుర్తించినా, మన ఆనందంలోంచి తప్పుకుని వాళ్లకోసం చెయ్యిచాచము. చాచినా, సహాయాన్ని తీసుకోరు. సహాయం చెయ్యలేము. నిస్సహాయులము. సహాయం తీసుకోడం వారి చాతకాదు. దౌర్భాగ్యులు, నిస్సహాయులు, విచిత్రమైన లోకం—భయంకరమైన జీవితం—

"నేను కష్టపెట్టి, నలగకొట్టతలుచుకొన్న వాళ్లకి నువ్వా, ఓరి అల్పుడా, నువ్వా, సహాయం చేసేది! కానీ!" అని మొహాన నవ్వినట్టుంటుంది, యెవరో రాక్షసి!

తెల్లవారి నేను లేచేముందే వెళ్ళిపోయింది.

రెండురోజుల తరవాత ఒకనాటి మధ్యాహ్నం, నేను వసారాలో పడుకుని అబ్బాయిని గిలిగింతలు పెట్టి నవ్విస్తూ వుండగా, దుర్గమ్మవొచ్చి మంచంప్రక్కన కూచుంది.

"అన్నయ్యా! ఆనాడు నన్నెక్కడికన్నా పొమ్మన్నావే! పోతాను. ఎక్కడికి పోను?"

అన్నానన్నమాటే గాని ఎక్కడికి పంపను?

"మీ అమ్మదగ్గిరికో, అన్నయ్యదగ్గిరికో వెళ్లకూడదా?"

"అయింది. మళ్ళీ లాక్కొచ్చాడు."

మాయింటో వుండమనడానికి ధైర్యంలేదు. రత్తయ్య వొచ్చి గోల చేస్తే మానాయన వొప్పుకోడు. నేను మాత్రం అపవాదుపడగలనా?

"ఎక్కడన్నా నేను వుంచుతాను, యీవూళ్ళో."

"బతకనీడు."

ఇంకేం చెయ్యను?

ఆలోచించాను. ఏమీ తోచలేదు. ఎందుకు నన్నిట్లా బాధపెడుతుంది! పోదేమో అనిపించింది. ఆమె బట్టలూ, వొళ్లూ, భరించలేని వాసన వేస్తున్నాయి. నాపిల్లవాడి కక్కడ పట్టుకుంటుందో ఆమెనించి రోగం.

"సరలే, చూస్తాలే, దుర్గమ్మా, వెళ్లు."

కాళ్ళీడ్చుకుంటో వెళ్ళింది. అప్పుడన్నా నాకర్థంకాలేదు ఆమె బాధ బరువు.

తెల్లవారేటప్పటికి చచ్చివుంది. రాత్రంతా ఆమె కేకలు మూలుగులు విన్నవాళ్ళే అంతా, ఒక్కరూ కదల్లేదు. కిటికీలూ, తలుపులూ, చెవులూ, మనసులూ, బిగించుకుని హాయిగా పడుకున్నారు. ఏం జరిగిందో ఎవరికన్నా తెలుస్తుందా? ఎవరు చెపుతారు? వాడా? వాడేమీ చెప్పడు. చెప్పినా అబద్ధాలు. ఆ కాలిపోయిన పెదిమలు యిదివరకు చెప్పలేదు. ఇంక చెప్పవు.